సాక్షి తూర్పుగోదావరి

శుక్రవారం । 30 । ఆగస్టు । 2024



అన్నవరానికి 'ప్రసాద్'ం దక్కేనా..

అన్నవరం సత్యదేవుని దేవస్థానానికి కేంద్ర ప్రభుత్వ పథకం 'ప్రసాద్' నిధులు దరిచేరడం లేదు. పదేళ్లుగా ఇదే పరిస్థితి నెలకొంది.




కూటమి ప్రభుత్వంలో జనసేన మహిళల కష్టాలు

కూటమి సర్కారులో జనసేన మద్దతుదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. రామరాజులంకలో నీటి కోసం ఆందోళన చేయడం శోచనీయం.

8లో

3.30 లక్షల క్యూసెక్కుల నీరు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గురువారం సాయంత్రం 3,30,935 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద 10.90 అడుగులకు నీటిమట్టం చేరింది. ఖరీఫ్‌కు సంబంధించి తూర్పు డెల్టాకు 4,200, మధ్య డెల్టాకు 2,100, పశ్చిమ డెల్టాకు 7 వేల క్యూసెక్కులు వదిలారు.

న్యూస్‌రీల్

వికాస ఆధ్వర్యంలో జాబ్ మేళా రేపు

రాజమహేంద్రవరం రూరల్: స్థానిక జిల్లా కలెక్టరేట్‌లో వికాస ఆధ్వర్యంలో ఈ నెల 31వ తేదీ శనివారం ఉదయం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు వికాస ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.లచ్చారావు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అపోలో ఫార్మసీలో ఫార్మాసిస్ట్, ముత్తూట్ ఫైనాన్స్‌లో బ్రాంచ్ ఎగ్జిక్యూటివ్, ప్రొబెషనరీ పోస్టులకు, ఐడీఎఫ్‌లో క్యాడ్ డిజైనర్, ఇండో ఎంఐఎం కంపెనీలో టెక్నీషియన్, రెప్యూటెడ్ కంపెనీలో కెమిస్ట్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. ఉద్యోగాలకు ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లొమో- డిగ్రీ, బీటెక్ ఉత్తీర్ణులైన 30 ఏళ్లలోపు అభ్యర్థులు అర్హులన్నారు. వీరి అర్హత మేరకు నెలకు రూ.10 వేల నుంచి రూ. 25 వేల వరకూ జీతం మరియు ఇన్సెంటివ్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలకు అనుగుణంగా ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు శనివారం బొమ్మూరులోని కలెక్టరేట్ వికాస కార్యాలయం వద్ద ఉదయం 9.30 గంటలకు విద్యా అర్హతల సర్టిఫికెట్ల జెరాక్స్‌లతో నేరుగా హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు www.vikasoajbr.com లేదా ఫోన్ నంబర్ 76608 23903ను సంప్రదించాలని తెలిపారు.

వెండి కిరీటం సమర్పణ



కిరీటానికి సంప్రోక్షణ పూజలు చేస్తున్న భక్తులు

మామిడికుదురు: పెదపట్నంలంక గిడుగువారి పాలెం గ్రామ దేవత వనువులమ్మకు గురువారం ఐదు కిలోల వెండి కిరీటాన్ని అలంకరించారు. స్థానికులు, గ్రామ ఆడపడచులు అందించిన రూ.నాలుగు లక్షల విరాళంతో దీన్ని తయారు చేయించారు. కిరీటానికి అంకం వెంకట శ్రీనివాస్ ఆధ్వర్యంలో సంప్రోక్షణతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి అలంకరణ చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

వేద పఠనంతో పులకించిన 'కుమారారామం'



పంచారామ క్షేత్రంలో వేదసభను నిర్వహిస్తున్న పండితులు

సామర్లకోట: పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత చాళుక్య కుమారారామ భీమేశ్వరాలయం వేద పఠనంతో పులకించింది. గురువారం ఈ క్షేత్రంలో శ్రీబాలాత్రిపుర సుందరి వేదశాస్త్ర పరిషత్తు ఆధ్వర్యంలో 26వ వేదసభను నిర్వహించారు. దీనికి వేద పండితుడు శ్రీపాద రాజశేఖరశర్మ అధ్యక్షత వహించారు. పూర్వపు ఉభయ గోదావరి జిల్లాలు, కృష్ణా జిల్లాకు చెందిన వేద పండితులు హాజరయ్యారు. విష్ణుభట్ల లక్ష్మీ నారాయణ ఘనాపాఠి (విజయవాడ, టీటీడీ బోర్డు సీసీ మెంబర్), దువ్వూరి సూర్యప్రకాశ సోమయాజులు (రాజమహేంద్రవరం) ఘనాపాఠిలు వేదాల ప్రాధాన్యాన్ని వివరించారు. తరచూ వేద పారాయణ జరిగే ప్రాంతాలు అభివృద్ధి బాటలో పయనిస్తాయని వారు తెలిపారు. సృష్టిలో ప్రతి జీవికి వేదశాస్త్రం అనేక విధాలా రక్షణగా నిలుస్తుందదని వివరించారు. వేదాలను సరళ రీతిలో ప్రజలకు చేరువ చేసే విధంగా ప్రభుత్వం ప్రయత్నించాలన్నారు. సుమారు 200 మంది వేద పండితులు హిందూ సంస్కృతీ సంప్రదాయాలను వివరిస్తూ చతుర్వేద పారాయణ చేశారు. ఈఓ భళ్ల నీలకంఠం, భక్త సంఘ నాయకులు డాక్టర్ చందలాడ అనంతపద్మనాభం, కంటే బాబు, బిక్కిన సాయి, గంజి బూరయ్య, ఆర్వీ సుబ్బరాజు, వేదశాస్త్ర పరిషత్తు కన్వీనర్ గ్రంధి వీరవెంకట నాగసాయి నూక రామకృష్ణలు వేద పండితులను సత్కరించారు. అనేక మంది భక్తులు వేదసభను తిలకించారు.

అమ్మవారికి బంగారు గాజుల సమర్పణ



దాత దంపతులకు అమ్మవారి చిత్రపటం అందిస్తున్న ఈఓ విజయభాస్కర్‌రెడ్డి

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): కాకినాడలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో బాలాత్రిపుర సుందరి అమ్మవారికి తొమ్మిది గ్రాముల జత బంగారు గాజులను దాతలు సమర్పించారు. గురువారం వీటిని ఉత్సవ కమిటీ చైర్మన్ గ్రంధి నారాయణరావు (బాబ్జి), ఈఓ సీహెచ్ విజయభాస్కర్ రెడ్డిలకు కాకినాడకు చెందిన దేశిరాజు శ్రీనివాస్, కృష్ణ కిరణ్మయి దంపతులు అందించారు.



కంటికి రెప్పలా చూసుకోవాలి

దేశంలో ఇటీవల కాలంలో మహిళలపై దాడులు, హత్యలు, అత్యాచార యత్నాలు తరచూ జరుగుతున్నాయి. ప్రస్తుతం మహిళా ఉద్యోగులకు రక్షణ కరవైంది. వారు అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నారు. మహిళల మెడపై కొందరు వేధింపుల కత్తి పెడుతున్నారు. ప్రధానంగా ఆసుపత్రుల్లో వైద్య సేవలందించే మహిళా వైద్యులకు రక్షణ లేకుండా పోయింది. ఇందుకు నిదర్శనమే కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన ఘటన. ఇలాంటివి జరగకుండా ప్రభుత్వాలు కఠిన చట్టాలు తీసుకురావాలి. విధి నిర్వహణ సమయంలో కనీస వసతులు, భద్రత కల్పించాలి. మహిళా వైద్యులు, సిబ్బందిని కంటికి రెప్పలా చూసుకునేలా చర్యలు చేపట్టాలి.

– వెంకట్రావు, పీహెచ్‌సీ వైద్యుడు, పోతవరం, నల్లజర్ల మండలం



ప్రతి క్షణం భయం వెంటాడుతోంది



తమ పిల్లలు గొప్ప వైద్యులు కావాలని చిన్నతనం నుంచి తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చదివిస్తున్నారు. పిల్లలను ఎక్కడో దూరంగా, తెలియని ప్రాంతంలో ఉంచి చదివించాలంటే వారికి ఆందోళన ఉంటుంది. కోల్‌కతా వంటి సంఘటనలు జరిగిన ప్రతిసారీ తల్లిదండ్రుల గుండెలు తల్లడిల్లుతుంటాయి. తమ పిల్లలకు ఏమవుతుందోనన్న భయం ప్రతి క్షణం వారిని వెంటాడుతుంది. పీజీలకు వర్కింగ్ అవర్స్ ఎక్కువగా ఉంటున్నాయి. వారికి పని గంటలు తగ్గించి చదువుకొనే అవకాశం, విశ్రాంతి తీసుకునే సమయం ఇవ్వాలి.

– జక్కంపూడి సుకీర్తి, పీజీ వైద్య విద్యార్థిని, రాజమహేంద్రవరం

రోజూ దండుకోనేందుకు..

- జిల్లాలో జోరుగా పేకాట శిబిరాలు
- టీడీపీ నేతల అండతో నిర్వహణ
- రాజమహేంద్రవరం, కొవ్వూరు, చాగల్లులో ఏర్పాటు
- మిగిలిన ప్రాంతాల్లోనూ పెట్టేందుకు రంగం సిద్ధం
- రూ.కోట్లలో చేతులు మారుతున్న వైనం
- ప్రేక్షక పాత్రకు పోలీసులు పరిమితం



దండుకొనే వారికి దండుకున్నంత అంటారు.. అచ్చం అలానే 'పచ్చ'బ్యాచ్ నేతలు పథకం రచించారు.. అందినకాడకు దోచుకునేందుకు జూద క్రీడను ఎంచుకున్నారు.. సామాన్యుల జీవితాలను బుగ్గిపాలు చేస్తున్నారు.. తూర్పు గోదావరి జిల్లాలో ఈ తంతు బహిరంగంగానే జరుగుతున్నా అడిగేవారే కరవయ్యారు.. రోజుకు రూ.కోట్లలో చేతులు మారుతున్న వైనంపై 'సాక్షి' ప్రత్యేక కథనం ఇది.

సాక్షి, రాజమహేంద్రవరం: కూటమి ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టినప్పటి నుంచి జూదం జడలు విప్పింది. తూర్పుగోదావరి జిల్లా అనధికార పేకాట శిబిరాలకు కేంద్ర బిందువుగా మారింది. శని, ఆదివారాలు, సెలవు రోజుల్లో మరింత జోరుగా జూదక్రీడ సాగుతోంది. ఇలా రోజూ రూ.కోట్లలో చేతులు మారుతోంది. ఈ అడ్డగోలు వ్యవహారం టీడీపీ నేతల కనుసన్నల్లో జరుగుతుంది. దీనిని అడ్డుకునేందుకు ఎవరూ సాహసించడం లేదంటే పరిస్థితి చెప్పకనే అర్థమవుతోంది. పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న తీరు ఆరోపణలకు దారితీస్తోంది. పేకాట శిబిరాలను అరికట్టాల్సింది పోయి.. నిర్వహణకు మరింత తోడ్పాటు అందిస్తుండడం ప్రస్తుత చీకటి రాజ్యానికి నిదర్శనమైంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జూదాలపై ఉక్కుపాదం మోపింది. పేకాట క్లబ్‌లను మూసివేయించింది. కూటమి ప్రభుత్వం మాత్రం అసాంఘిక క్రీడకు గేట్లు తెరిచేయడంతో ప్రస్తుత పరిస్థితి 'ఆడిందే ఆట.. పాడిందే పాట'గా మారింది. ఈ పరిణామం పేదల కుటుంబాల్లో ఆందోళన నింపుతోంది. రోజంతా కష్టపడి సంపాదించిన డబ్బు కుటుంబ అవసరాల కంటే.. పేకాటకే తగలేస్తున్నారని మహిళలు ఆవేదన చెందుతున్నారు. ఇన్నాళ్లూ ప్రశాంతంగా ఉన్న జీవితాల్లోకి వచ్చిన మాయదారి పేకాటకు ఎప్పుడు స్వస్తి పలుకుతారో? అని ఆవేదనతో ఎదురు చూస్తున్నారు.

రాజమహేంద్రవరం.. చీకటి రాజ్యం

రాజమహేంద్రవరం పేకాటకు అడ్డాగా మారింది. ఆల్కాట్ గార్డెన్స్, క్వారీ మార్కెట్‌తో పాటు మరో రెండు ప్రాంతాల్లో జూద క్రీడ విచ్చలవిడిగా సాగుతోంది. ఇది ఆయా ప్రాంతాల్లో టీడీపీ నేతల కనుసన్నల్లోనే జరుగుతోంది. రోజుకు రూ.కోట్లలో చేతులు మారుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదు. టీడీపీ నేతలే నిర్వహిస్తుండటంతో అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పోలీసులకు సైతం నెలవారీ మామూళ్లు అందిస్తుండడంతో వదిలేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. జూదరులు ఆటలోకి ప్రవేశించేందుకు రుసుము కూడా వసూలు చేస్తున్నట్లు తెలిసింది. ఆటలో గెలిచిన వ్యక్తి లాభంలో 20 శాతం నిర్వాహకులకు సమర్పించుకునేలా నిబంధనలు పెట్టినట్లు సమాచారం. ఈ మొత్తం టీడీపీ నేతల జేబుల్లోకే వెళుతున్నట్లు తెలిసింది. ఆయా శిబిరాల వద్ద ప్రైవేట్ సైన్యాన్ని ఏర్పాటు చేసి పకడ్బందీగా జూదం ఆడిస్తున్నారు. రాజమహేంద్రవరం నగరంలోని నాలుగు పేకాట కేంద్రాల ద్వారా రోజూ రూ.2 కోట్లకుపైగా సొమ్ము చేతులు మారుతున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా సమాచారం.

చేతులు మారుతున్న రూ.కోట్లు

కొవ్వూరు పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్, క్లబ్‌లో అనధికారికంగా పేకాట నిర్వహిస్తున్నట్లు సమాచారం. టీడీపీ త్రిసభ్య కమిటీలోని ప్రధాన నేతల అండదండలతో శిబిరాలు నడుస్తున్నట్లు ఆరోపణలున్నాయి. రోజూ ఆట రంజుగా సాగుతోంది. ఇతర జిల్లాల నుంచి భారీ సంఖ్యలో ఆటగాళ్లు వస్తున్నారు. కార్లు, ద్విచక్ర వాహనాల్లో వస్తుండటంతో పేకాట శిబిరాల పరిసర ప్రాంతాల్లో సందడి వాతావరణం నెలకొంటోంది. జిల్లాకు ఎస్పీ కొత్తగా రావడంతో కొన్ని రోజులు విరామం ఇచ్చిన శిబిరాలు ప్రస్తుతం మళ్లీ మొదలైనట్లు తెలిసింది. రెండు శిబిరాల్లో రోజుకు రూ.కోటికిపైగా చేతులు మారుతున్నట్లు సమాచారం.



కొవ్వూరులోని ఓ పేకాట శిబిరం వద్ద వాహనాలు (ఫైల్)

అంతా తానై నడిపిస్తూ..

చాగల్లు మండలం కవలపల్లి గ్రామంలో అనధికార జూదం నడుస్తోంది. టీడీపీలోని ఓ యువనేత ఆధ్వర్యంలో శిబిరం నిర్వహిస్తున్నట్లు సమాచారం. పోలీసులకు రోజూ రూ.3 లక్షల వరకూ మామూళ్లు అందిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ వ్యవహారాన్ని డీఎస్పీ కార్యాలయంలోని ఓ ఉద్యోగి భుజాన వేసుకున్నట్లు తెలిసింది. పేకాట కేంద్రం వద్ద వసూళ్లు.. సర్దుబాట్లు మొత్తం సదరు ఉద్యోగి ఆధ్వర్యంలో నడుస్తున్నట్లు సమాచారం.

మూడు ముక్కలు.. ఆరు కోళ్లు

నిడదవోలు మండలం సింగవరం గ్రామం పేకాట, కోడి పందేలకు పెట్టింది పేరు. ఇతర జిల్లాల నుంచి భారీగా ఇక్కడకు జూదరులు వస్తున్నారు. రోజూ భారీగా పందేలు ఆడుతున్నారు. వెరసి ఇక్కడి పరిస్థితి 'మూడు ముక్కలు.. ఆరు కోళ్లు' అన్న చందంగా మారింది. శని, ఆదివారాల్లో పక్క జిల్లాల నుంచి ఆటగాళ్లు భారీగా వస్తున్నారు. సాధారణ రోజుల్లో రోజుకు రూ. కోటి, శని, ఆదివారాల్లో రూ.2 కోట్ల వరకూ చేతులు మారుతున్నాయి. పోలీసులకు సైతం భారీగా మామూళ్లు సమర్పిస్తున్నట్లు తెలిసింది. పేకాటకు సహకరించేందుకు ఓ పోలీసు అధికారికి నిర్వాహకులు బంగారం, ద్విచక్ర వాహనం కొనిచ్చినట్లు సమాచారం. పేకాట వ్యవహారం బహిర్గతం కావడంతో గత ఎస్పీ అప్పటి కొవ్వూరు డీఎస్పీని వీఆర్‌కు పంపినట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదిలా ఉంటే.. పేకాట క్లబ్‌లకు అనుమతులు తెచ్చేందుకు జనసేన నేతలు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారంటే అసాంఘిక కార్యక్రమాలకు ఏ స్థాయిలో గేట్లు తెరుస్తున్నారో చెప్పకనే అర్థం అవుతోంది.

పేదలు.. సమిధలు

పేకాట శిబిరాలు ఏర్పాటు చేసి పేదలు, మధ్య తరగతి ప్రజల బతుకులతో పచ్చ నేతలు ఆటలాడుకుంటున్నారు. జూద క్రీడల వైపు పేదలు ఆకర్షితులై రోజంతా కష్టపడి సంపాదించిన డబ్బును పోగొట్టుకుంటున్నారు. ఆటలో ఓటమి చెంది అప్పుల పాలవుతున్నారు. తిరిగి తమ అదృష్టాన్ని పరీక్షించుకుందామని అప్పు చేసి మరీ డబ్బులు తీసుకెళుతున్నారు. ఇలా చేసిన అప్పులు తీర్చలేక ఆత్మహత్యలు చేసుకుంటున్న సందర్భాలు గతంలో టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో చోటుచేసుకున్నాయి. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం తిరిగి పాత రోజులు తీసుకువచ్చింది. ఇప్పటికైనా వీటికి అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

హాస్టళ్లలో సౌకర్యాలు కల్పించండి

కంబాలచెరువు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తి చేసుకుంటున్నా, హాస్టళ్లలో సమస్యలను పట్టించుకోవడం లేదని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్‌కుమార్ ఆరోపించారు. హాస్టల్ విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కోరుతూ గురువారం రాజమహేంద్రవరంలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొన్న అనకాపల్లి, నిన్న ఏలేశ్వరం, నేడు నూజివీడు.. ఇలా రోజుకో ప్రాంతంలో హాస్టల్ విద్యార్థులు ఆసుపత్రుల పాలవుతున్నా కూటమి ప్రభుత్వానికి చీమకుట్టినట్టు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ హాస్టళ్లలో మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచడం లేదని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూపై శ్రద్ధ చూపడం లేదని దుయ్యబట్టారు. హాస్టళ్లలో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఇక్కడి విద్యార్థుల పట్ల ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపుతోందన్నారు. నక్కపల్లిలో గిరిజన అనాథ శరణాలయం విద్యార్థులు కలుషిత ఆహారం తిని విశాఖపట్నంలోని ఆసుపత్రిలో చేరడం ముగ్గురు చనిపోవడం, ఏలేశ్వరం గిరిజన హాస్టల్‌లో 84 మంది విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ జరగడం, ఇప్పుడు నూజివీడు ఐఐఐటీ హాస్టల్‌లో కలుషిత ఆహారం తిని విద్యార్థులు ఆసుపత్రి పాలవ్వడం విచారకరమన్నారు. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని, వార్డెన్లను సస్పెండ్ చెయ్యాలని, వసతి గృహాల నిర్వహణపై రాష్ట్ర వ్యాప్తంగా కమిషన్ వేయాలన్నారు.



విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని ఆందోళన చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

రేపటి నుంచే పింఛన్ల పంపిణీ చేయాలి

కలెక్టర్ ప్రశాంతి ఆదేశాలు

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలో ఈ నెల 31వ తేదీ ఉదయం 5 గంటల నుంచి 2,39,152 మంది లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేసేందుకు సన్నద్ధం కావాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి డివిజన్, మండల స్థాయి, మండల ప్రత్యేక అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హరిత ఆంధ్రప్రదేశ్, ఎన్టీఆర్ భరోసా పంపిణీపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శనివారం ఉదయం 5 గంటలకు పింఛన్ల పంపిణీ ప్రారంభించి మధ్యాహ్నం 12 గంటలకు పూర్తి చేయాలన్నారు. దానికి అనుగుణంగా ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. హరిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాన్ని సామాజిక బాధ్యతగా చేపట్టి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలన్నారు. శుక్రవారం నుంచి నవంబర్ 1వ తేదీ వరకూ వివిధ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. రోజూ ఒక్కో విభాగం ద్వారా తల్లి పేరుతో ఒక మొక్క నాటి పరిరక్షణ చేపట్టాలన్నారు.

తెలుగులోనే మాట్లాడదాం

తెలుగు వచనాన్ని ప్రజల వాడుక భాషలోకి తీసుకువచ్చిన గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు చిరస్మరణీయుడని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. కలెక్టరేట్‌లో రామ్మూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ తెలుగు భాషలో మాధుర్యాన్ని అందరికీ తెలియజెప్పిన మహనీయుడు గిడుగు అన్నారు. మాతృ భాషను గౌరవించుకోవడం ముఖ్యమని, నేడు భాషను మర్చిపోయే పరిస్థితికి రావడం దురదృష్టకరమని తెలిపారు. ప్రతి ఒక్కరూ తెలుగులో చదవడం, రాయడం, మాట్లాడం చెయ్యాలని పిలుపునిచ్చారు. వక్తలు మాట్లాడుతూ ఇతర భాషలపై ఆసక్తి ఉండవచ్చని, కానీ మాతృ భాషను మరువరాదన్నారు. మన సంస్కృతీ సంప్రదాయాలు తెలుసుకోవాలంటే మాతృ భాష ఎంతో అవసరమన్నారు. అనంతరం ఉపాధ్యాయులు వల్లించిన పద్యాలు, పాటలు, కవితలు ఆకట్టుకున్నాయి. గిడుగు రామ్మూర్తి జీవిత విశేషాలపై విద్యార్థి కిశోర్, వాడుక భాష తెలుగుపై నాలుగో తరగతి విద్యార్థి విధేయత చేసిన ప్రసంగం, డీఈఓ వాసుదేవ రావు చెప్పిన కవిత ఆకట్టుకున్నాయి. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులను కలెక్టర్ చేతుల మీదుగా సన్మానించారు. జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్న రాముడు, డీఆర్వో జి.నరసింహులు తదితరులు పాల్గొన్నారు.



గిడుగు రామ్మూర్తి పంతులుకు నివాళులర్పిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

కొండెక్కిన జీడిపప్పు

- తగ్గిన గింజల దిగుబడి
- పెరిగిన పప్పు ధర
- గుండు కిలో రూ.820
- సామాన్యుల అవస్థలు

సఖినేటిపల్లి: జీడిపప్పు ధర కొండెక్కింది. స్థానికంగా గింజలు లభించకపోవడంతో పాటు విదేశాల నుంచి దిగుమతి లేకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ఉన్న గింజలకు డిమాండ్ ఏర్పడి జీడిపప్పు ధర పెరిగిపోవడంతో లాభాలు రాక వ్యాపారులు, కొనడానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. జీడిపప్పు తయారీలో కేరళది అగ్రస్థానం కాగా తర్వాతి స్థానం కోనసీమలోని మోరిదే. ఇక్కడి జీడిపప్పుకు కేరళ పప్పు కంటే చక్కని రుచి ఉండడం వల్ల దీనికి దేశ వ్యాప్తంగా డిమాండ్ ఉంది. ఇక్కడ తయారీ విధానం ప్రత్యేకంగా ఉండడమే దీనికి కారణం. ఈ జీడిపప్పు పరిశ్రమకు శతాబ్దానికి పైగా చరిత్ర ఉంది. గతంలో మోరికి పరిమితమైన ఈ పరిశ్రమ ఇతర ప్రాంతాలకు విస్తరించింది. అయితే ఈ సీజన్ ప్రారంభమైన మార్చి నుంచి ప్రతికూల వాతావరణం కారణంగా గింజల దిగుబడి తగ్గంది. దీంతో జీడిపప్పు ధర గణనీయంగా పెరిగిపోయి వినియోగదారులకు చుక్కలు చూపెడుతోంది. రెండు నెలలుగా మార్కెట్‌లో జీడిపప్పును కొనలేక పోతున్నారు.

రాజోలు దీవిలో..

రాజోలు దీవిలో జీడిపప్పు తయారీ, అమ్మకం కుటీర పరిశ్రమగా సాగుతోంది. ప్రప్రథమంగా మోరిలో మొదలైన జీడిపప్పు తయారీ తదనంతర కాలంలో రాజోలు దీవిలోని సుమారు 25 గ్రామాలకు విస్తరించింది. దీని ద్వారా అనేక పేద, మధ్య తరగతి కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయి. ఇక్కడ ఏడాదికి సుమారు 8 నుంచి 9 లక్షల టన్నుల జీడిపప్పు తయారవుతుందని అంచనా. ఈ పరిశ్రమపై ఆధారపడి 25 వేల మంది వరకూ జీవనం సాగిస్తున్నారు.

మార్చి నుంచి సీజన్

ఏటా మార్చి నుంచి కొత్తగా మార్కెట్‌లోకి వచ్చే దేశవాళీ గింజలతో సీజన్ ప్రారంభమవుతుంది. వీటితో పాటు విదేశీ గింజలతో మే వరకూ కొనసాగుతుంది. కానీ ఈ ఏడాది ప్రతికూల వాతావరణం కారణంగా గింజల దిగుబడి బాగా తగ్గిపోయింది. విదేశాల నుంచి కూడా గింజలు రాలేదు. ఇదే సమయంలో పెళ్లిళ్ల సీజన్ ప్రారంభం కావడంతో ఉన్న జీడిపప్పుకు డిమాండ్ పెరిగింది. ఈ నేపథ్యంలో ధర ఎక్కువ కావడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రాజోలు దీవి నుంచి హైదరాబాద్, విజయవాడ, రాజమహేంద్రవరం, పాలకొల్లు, భీమవరం, నర్సాపురాలకు జీడిపప్పు ఎగుమతి అవుతుంది. జీడిగింజల ధర బాగా పెరిగిపోవడంతో చిరు వ్యాపారులు వాటిని కొనుగోలు చేయడానికి అధికంగా పెట్టుబడి పెట్టాల్సి వస్తోంది.

స్వదేశీ గింజలతో వ్యాపారం

సీజన్‌లో స్వదేశీ గింజలతో వ్యాపారం ప్రారంభమవుతుంది. ఇక్కడి వ్యాపారులు జీడిగింజలను రాజానగరం, మధురపూడి, ఎల్లవరం, జంగారెడ్డిగూడెం, దేవరపల్లి, గోపాలపురం, దూబచర్ల, కొయ్యలగూడెం నుంచి దిగుమతి చేసుకుంటారు. 80 కిలోల దేశవాళీ బస్తా గింజలకు రవాణా చార్జీలతో కలిపి రూ.13 వేలు ఖర్చవుతుంది. వాటిని పప్పుగా తయారు చేయడానికి వ్యాపారస్తులు మరో రూ.1500 వెచ్చించాలి. స్వదేశీ గింజల్లో లభించే ముడిపప్పు 20 కిలోలను మూడు రకాలుగా గ్రేడింగ్ చేస్తారు. 10 కిలోల గుండు మొదటి రకం, 8 కిలోల ముక్కబద్ద రెండో రకం, 2 కిలోల నలిముక్క మూడో రకంగా విభజిస్తారు. ప్రస్తుతం మార్కెట్‌లో కేజీ గుండు రూ.820, బద్దముక్క రూ.770, నలిముక్క రూ.400 పలుకుతోంది. ఈ ప్రకారంగా గుండుకు రూ.8,200, ముక్కబద్దకు రూ.6,160, నలి ముక్కకు రూ.800 లభిస్తోంది. ఇలా చూసుకుంటే ఈ గింజల ద్వారా ఆదాయం రూ.15,160 మాత్రమే వస్తుంది.

లాభం లేక..

మార్కెట్‌లో 80 కిలోల గింజలను కొనుగోలు చేసి, వాటిని పప్పుగా తయారు చేయడానికి రూ.14,500 పెట్టుబడి అవుతుంది. దాన్ని తెల్ల పప్పుగా అమ్మకాలు జరిపితే రూ.15,160 వస్తుంది. అంటే వ్యాపారస్తుడికి మిగిలేది కేవలం రూ.660. ఇందులో కొన్ని ఇతర ఖర్చులు కూడా ఉంటాయి.



తగ్గిన గింజల దిగుబడి

గతంలో ఎంతో వైభవంగా సాగిన జీడిపప్పు పరిశ్రమ ఇప్పుడు ఆటుపోట్లతో కొనసాగుతోంది. ప్రతికూల వాతావరణంలో గింజల లభ్యత బాగా తగ్గిపోయింది. ఉన్న పప్పుకు విపరీతమైన డిమాండ్ పెరిగింది. దీంతో జీడిపప్పు ధర బాగా పెరిగిపోయింది. భారీగా పెట్టుబడి పెట్టి వ్యాపారం చేయలేకపోతున్నాం.

– ముప్పర్తి ఆదినారాయణమూర్తి, చిరు వ్యాపారి, మోరి

వ్యాపారం కష్టమే

గింజల దిగుబడి తగ్గిపోవడంతో జీడిపప్పు రేటు అమాంతం పెరిగిపోయింది. అంత ధర వెచ్చించి కొనుగోలు చేయడానికి ప్రజలు భయపడుతున్నారు. మాకు కూడా వ్యాపారం చేయడం కష్టంగా మారింది. గింజలు పుష్కలంగా లభిస్తే పెళ్లిళ్ల సీజన్‌లో ఎంతో లాభసాటిగా ఉండేది.

– జక్కంపూడి మాణిక్యాలరావు, చిరువ్యాపారి, మోరి

కుల ముద్రలేని నాయకుడు రంగా



రంగా విగ్రహావిష్కరణకు హాజరైన నాయకులు

రామచంద్రపురం రూరల్: రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అండగా నిలిచి, వారి అభిమానాన్ని చూరగొన్న నాయకుడు వంగవీటి రంగా అని ఆయన కుమారుడు, మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ అన్నారు. రంగాపై కుల ముద్ర లేదని, ఆయన ప్రజా నాయకుడని చెప్పారు. అందుకు తార్కాణంగా ఆయన విగ్రహావిష్కరణకు అన్ని కులాల నాయకులు ఈ వేదికపైకి రావడమేనన్నారు. ముందుగా మండలంలోని అన్నాయిపేటలో రంగా విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అధ్యక్షతన జరిగిన సభలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ, కులాల మధ్య వైరాలను తగ్గించి, సామరస్యం పెంచిన నాయకుడు వంగవీటి రంగా అని కొనియాడారు. రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ మాట్లాడుతూ రాయలసీమలో వర్గ పోరాటాలు, కోస్తాలో కుల పోరాటాలు ఉండేవన్నారు. ప్రజలు చైతన్యవంతం కావడం వల్ల రానురాను కుల పోరాటాలు తగ్గి, కులాల మధ్య సామరస్యం పెరిగిందన్నారు. ఎంపీ గంటి హరీష్‌మాధుర్ మాట్లాడుతూ, కోనసీమలో రంగా అభిమానులు ఆయన ఆశయాలను కొనసాగించాలన్నారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మాట్లాడుతూ, సామాన్యులకు ఏ సమస్య వచ్చినా ముందుండి పోరాడిన వ్యక్తి రంగా అన్నారు. జక్కంపూడి గణేష్, నల్లా అజయ్, చిక్కాల దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా సామూహిక సత్య దత్త వ్రతాలు


సామూహిక సత్యదత్త వ్రతాలలో పాల్గొన్న భక్తులు

పిఠాపురం: స్థానిక శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానంలో శ్రావణ బహుళ ఏకాదశి సందర్భంగా గురువారం సామూహిక సత్య దత్త వ్రతాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు, వేద పండితుల ఆధ్వర్యంలో శ్రీపాద శ్రీవల్లభ స్వామికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు జరిపారు. ఈ సందర్భంగా భక్తులు సామూహిక సత్య దత్త వ్రతాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో ఆలయ ఈఓ సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

అధికారులకు ముగిసిన శిక్షణ


శిక్షణ పూర్తి చేసుకున్న అధికారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న కృష్ణమోహన్ తదితరులు

సామర్లకోట: శిక్షణను జిల్లా స్థాయి అధికారులు సద్వినియోగం చేసుకోవాలని పంచాయతీరాజ్ అసిస్టెంట్ కమిషనర్ ఈ.కృష్ణమోహన్ సూచించారు. శ్రీకాకుళం నుంచి ఏలూరు వరకూ గల 11 జిల్లాలలోని అధికారులకు సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై ఇచ్చిన శిక్షణ గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి కృష్ణమోహన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ శిక్షణ పూర్తి చేసుకున్న అధికారులు ఆయా జిల్లాలో మండల స్థాయి అధికారులు శిక్షణ ఇవ్వాలన్నారు. ఫ్యాకల్టీలు జీవీఎస్ శ్రీదేవి, కేఆర్ నిహారిక, డీఆర్ఎస్ పద్మజ, ఎం.చక్రపాణిరావు, బి.వెంకటేశ్వర్లు, వి.ప్రసాద్, బి.ఆంజనేయులు పాల్గొన్నారు.

పేకాట శిబిరాలపై దాడి

సఖినేటిపల్లి: రామేశ్వరంలో జరుగుతున్న రెండు పేకాట శిబిరాలపై గురువారం పోలీసులు ఆకస్మికంగా దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.26,580 స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేశామని ఎస్సై కె.దుర్గా శ్రీనివాసరావు తెలిపారు.

కోల్‌కతా ఘటన దారుణం



కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన ఘటన చాలా దారుణం. రోగుల ప్రాణాలను కాపాడటానికి వైద్యులు ఎంతో శ్రమిస్తారు. ఏ సమయంలోనైనా వైద్యం అందించేందుకు సిద్ధంగా ఉంటారు. అలాంటి వైద్యురాలిపై ఘాతుకానికి పాల్పడడం అనైతికం. నిందితులను వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలి. రాత్రి సమయంలో విధులు నిర్వహించే మహిళా డాక్టర్లు, ఆరోగ్య సిబ్బందికి పోలీస్ రక్షణ కల్పించాలి.

– డాక్టర్ రాజనాల ప్రసాద్, ఉండ్రాజవరం పీహెచ్‌సీ వైద్యులు



వైద్యుల రక్షణకు ప్రత్యేక చట్టం

ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యులు, పారామెడికల్ సిబ్బందిపై ఇటీవల దాడులు పెరిగిపోవడం ఆందోళన కలిగిస్తోంది. రేయింబవళ్లు ప్రజలకు వైద్య సేవలు అందించే సిబ్బందికి రక్షణ లేకపోవడం దారుణం. మహిళా వైద్యులతో పాటు రాత్రి వేళల్లో విధులు నిర్వహించే సిబ్బందికి రక్షణ కల్పించేందుకు ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలి. ప్రతి ఆస్పత్రిలోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి సెక్యూరిటీని పటిష్టం చేయాలి.

– డాక్టర్ మురళీమోహన్‌రెడ్డి, వైద్యాధికారి, శాంతి ఆశ్రమం, పీహెచ్‌సీ



అన్నవరానికి ప్రసాద్‌ం దక్కేనా..

- కేంద్ర పథకంపై కానరాని పురోగతి
- ప్రతిపాదనలతోనే సరి
- పట్టించుకోని జిల్లా ప్రజాప్రతినిధులు


ప్రసాద్ స్కీం నిధులతో నిర్మించనున్న అన్నదాన భవనం నమూనా


సత్యదేవుని ఆలయాన్ని పరిశీలిస్తున్న కేంద్ర ప్రభుత్వ అధికారులు (ఫైల్)

అన్నవరం: రత్నగిరిపై కొలువైన సత్యదేవునికి నిత్యం వైభవంగా పూజలు జరుగుతాయి. వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చి ఆయనను దర్శించుకుంటారు. అన్నవరం ప్రసాదం తీసుకుని సంతోషంగా ఇళ్లకు తిరిగి వెళతారు. భక్తులకు అందుతున్న సత్యదేవుని ప్రసాదానికి ఎటువంటి ఇబ్బంది లేదు. కానీ సత్యదేవునికి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రసాదం మాత్రం అందడం లేదు. దాదాపు పదేళ్లుగా ఊరేస్తూనే ఉంది. వివరాల్లోకి వెళితే.. 2014లో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడి, నరేంద్రమోదీ ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత పిలిగ్రిమేజ్ రెజువనేషన్ అండ్ స్పిరిట్యువాలిటీ అగ్మంటేషన్ డ్రైవ్ (ప్రసాద్) స్కీమ్ ప్రారంభించింది. దీని ద్వారా వివిధ పుణ్యక్షేత్రాలలో భక్తులకు అవసరమయ్యే వివిధ నిర్మాణాలు చేపడతారు.

ప్రతిపాదనలు

ఈ పథకానికి సంబంధించి అన్నవరం దేవస్థానం నుంచి కేంద్ర ప్రతిపాదనలను ఆహ్వానించింది. దీంతో రూ.92 కోట్లతో భక్తులకు అవసరమయ్యే నిర్మాణాలు చేపట్టేందుకు దేవస్థానం ప్రతిపాదనలు అందించింది. దీనిపై దేవస్థానం, కేంద్ర, రాష్ట్ర టూరిజం శాఖ అధికారుల మధ్య చర్చలు జరిగాయి. 2019లో ఎన్నికల అనంతరం కేంద్రంలో ఎన్‌డీఏ-2 ప్రభుత్వం, రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక కేంద్ర టూరిజం శాఖ అధికారుల సూచనల మేరకు ప్రసాద్ స్కీం ప్రతిపాదనలను రూ.54 కోట్లకు కుదిస్తూ మరో నివేదిక కేంద్ర ప్రభుత్వానికి అందజేశారు. మరోసారి కేంద్ర టూరిజం శాఖ అధికారులు దేవస్థానానికి విచ్చేసి పరిశీలన జరిపిన అనంతరం 2023లో రూ. పది కోట్లు మాత్రమే మంజూరు చేస్తామని తేల్చి చెప్పారు. దీనిపై అప్పటి కాకినాడ ఎంపీ వంగా గీత అప్పటి కేంద్ర టూరిజం శాఖా మంత్రి జి.కిషన్ రెడ్డి కలిసి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో రూ.20.06 కోట్ల ప్రసాద్ నిధులు మంజూరుకు నిర్ణయించారు.

ప్రధాని మోదీ శంకుస్థాపన

ప్రసాద్ స్కీమ్ కింద దేవస్థానంలో రూ.20.06 కోట్లతో చేపట్టనున్న నిర్మాణాలను గత మార్చి ఏడో తేదీన జమ్ము కాశ్మీర్ రాజధాని శ్రీనగర్ నుంచి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. అయితే కేంద్రం మరోసారి షాక్ ఇచ్చింది. ప్రసాద్ స్కీం కింద ఎంపికైన పథకాలను మరోసారి పరిశీలించాలని కేంద్ర టూరిజం శాఖ అధికారులు నిర్ణయించారు. ఎన్‌డీఏ-3 ప్రభుత్వంలో టూరిజం మంత్రితో సహ అంతా కొత్తవారు కావడంతో విషయం మళ్లీ మొదటికి వచ్చింది. 2024లో ఎన్నికల అనంతరం కేంద్రంలో ఎన్‌డీఏ -3 ప్రభుత్వం ఏర్పడడంతో కేంద్ర టూరిజం శాఖ మంత్రి కిషన్ రెడ్డి స్థానంలో రాజస్థాన్‌కు చెందిన గజేంద్రసింగ్ బాధ్యతలు చేపట్టారు. అలాగే టూరిజం శాఖ ఉన్నతాధికారులు కూడా మారిపోయారు.

కేంద్ర అధికారుల పరిశీలన

కేంద్ర టూరిజం శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సుదీప్తో మోండల్, కన్సల్టెంట్ కనికా దత్తా ఇటీవల రత్నగిరిపై ప్రసాద్ స్కీం నిర్మాణాల స్థలాలను పరిశీలించిన అనంతరం దేవస్థానం ఈఓ కె.రామచంద్రమోహన్, ఇతర అధికారులతో సమావేశమై చర్చించారు. ప్రసాద్ నిధులతో చేపట్టనున్న అన్నదానం భవనం, వ్రత మండపాలు, క్యూ కాంప్లెక్స్ నిర్మాణాల ఆవశ్యకత, భక్తులను ఆలయానికి చేర్చేందుకు చేపట్టనున్న ఆరు ఎలక్ట్రానిక్ కార్లు అవసరాన్ని ఈఓ వారికి వివరించారు. సమావేశంలో రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ సీఈ సీఎస్ఎన్ మూర్తి, ఈఈ ఎంవీ రాజారావు, మేనేజర్ బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు.

కానరాని పురోగతి

కేంద్ర అధికారులతో సమావేశం జరిగి నాలుగు నెలలైనా పురోగతి లేదు. బీజేపీ పాలిత రాష్ట్రాలలోని పుణ్యక్షేత్రాలలో ఇప్పటికే ప్రసాద్ నిధులు విడుదలై నిర్మాణాలు కూడా పూర్తయ్యాయి. కానీ దక్షిణాది రాష్ట్రాలకు సంబంధించిన ఆలయాల్లో మాత్రం జరగలేదు.

పట్టించుకోని ప్రజాప్రతినిధులు

ప్రసాద్ పనుల ప్రారంభానికి ప్రస్తుత ప్రజాప్రతినిధులు చొరవ చూపడం లేదు. కాకినాడ జిల్లా మంత్రిగా జనసేన అధినేత డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఎంపీగా అదే పార్టీకి చెందిన తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, ప్రత్తిపాడు ఎమ్మెల్యేగా వరుపుల సత్యప్రభ ఉన్నారు. ఇప్పటికైనా ప్రసాద్ నిధులు తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని భక్తులు కోరుతున్నారు.

తెలుగుభాషను పరిరక్షించుకోవాలి


గిడుగు రామమూర్తి, ధ్యాన్ చంద్ చిత్రపటాలకు పుష్పాంజలి ఘటిస్తున్న నన్నయ అధికారులు

రాజానగరం: ఆధునిక సమాజంలో సోషల్ మీడియా సాధనాలు అనుసరిస్తున్న కొత్త పోకడలు తెలుగుభాష ఔన్నత్యాన్ని దెబ్బతీస్తున్నాయని ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ తరుణంలో అమ్మ భాషను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. యూనివర్సిటీలోని ఈసీ హాలులో గురువారం తెలుగుభాష, జాతీయ క్రీడా దినోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గిడుగు రామమూర్తి, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇన్‌చార్జి వీసీ మాట్లాడుతూ బాల్యం నుంచి మాతృభాషపై పట్టుసాధించాలని, తెలుగుభాష పరిరక్షణకు భాగస్వాములు కావాలన్నారు. హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్‌ని స్ఫూర్తిగా తీసుకుని యువత క్రీడలలో రాణించాలన్నారు. ఖేలో ఇండియా నిధులతో యూనివర్సిటీ ప్రాంగణంలో మల్టీపర్పస్ ఇండోర్, స్విమ్మింగ్ పూల్ నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, తెలుగు భాష విభాగం అధ్యాపకులు డాక్టర్ తరపట్ల సత్యనారాయణ, ఫిజికల్ ఎడ్యుకేషన్ కోర్సు కోఆర్డినేటర్ బాల సత్యనారాయణ పాల్గొన్నారు.

80 కేజీల గంజాయి స్వాధీనం


పోలీసులు స్వాధీనం చేసుకున్న ట్యాంకర్

కిర్లంపూడి: ట్యాంకర్‌లో తరలిస్తున్న 80 కేజీల గంజాయిని కిర్లంపూడి పోలీసులు పట్టుకున్నారు. వైజాగ్ వైపు నుంచి రాజమహేంద్రవరం వైపు గంజాయి రవాణా జరుగుతున్నట్టు వచ్చిన సమాచారంతో స్థానిక ఎస్సై జి.సతీష్ తన సిబ్బందితో కృష్ణవరం టోల్‌గేట్ వద్ద బుధవారం అర్ధరాత్రి తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో అటుగా వెళుతున్న ట్యాంకర్‌ను తనిఖీ చేయగా క్యాబిన్‌లో 80 కేజీల గంజాయి బయటపడింది. దీంతో వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారణ నిర్వహించారు. దీనిపై పోలీసులు ఎటువంటి సమాచారం వెల్లడించలేదు.

వరిని ఆశించిన పాముపొడ తెగులు

తాళ్లపూడి: ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో వరిలో పాము పొడ (మాగుడు) తెగులును గుర్తించినట్టు జిల్లా ఏరువాక కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త మానుకొండ శ్రీనివాస్ తెలిపారు. వేగేశ్వరపురంలోని వరిచేలను మార్టేరు పరిశోధనా కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త సీహెచ్ శ్రీనివాస్, కొవ్వూరు ఏడీఏ పి. చంద్రశేఖర్‌తో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం ఈ సీజన్‌లో ప్రయోగాత్మకంగా సాగు చేస్తున్న బీపీటీ 3082, 2858, ఎంటీయూ 1275 వరి క్షేత్రాలను సందర్శించారు. వారు మాట్లాడుతూ పొడ తెగులు కారణంగా దుబ్బులు కుళ్లిపోతాయన్నారు. దాని నివారణకు హెక్సాకోనజోల్ లీటర్ నీటికి 2 ఎంఎల్, లేదా వాలిడామైసిన్ లీటర్ నీటికి 2 ఎంఎల్, లేదా ప్రోపికొనజోల్ లీటర్ నీటికి ఒక ఎంఎల్ మందును అధికారుల సూచనల మేరకు పిచికారీ చేయాలన్నారు. ఏవో జి.రుచిత పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలు మరింత విస్తృతం

- ఉమ్మడి జిల్లాలో టవర్లను పెంచేందుకు చర్యలు
- ఆ సంస్థ జనరల్ మేనేజర్ రాజు
- అమలాపురంలో అవగాహన ర్యాలీ


అమలాపురంలో మాట్లాడుతున్న బీఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ రాజు

అమలాపురం టౌన్: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలను విస్తృతం చేస్తూ వినియోగదారుల సంఖ్యను పెంచుకునేందుకు కృషి చేస్తున్నామని ఆ సంస్థ జిల్లా జనరల్ మేనేజర్ పలివెల రాజు తెలిపారు. అమలాపురం దుడ్డివారి అగ్రహారంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో డీఈ పీఎస్ఎల్ నరసింహారావు అధ్యక్షతన గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జనరల్ మేనేజర్ రాజు మాట్లాడుతూ ఇప్పటికే తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలలో వినియోగదారులకు 4జీ సేవలపై అవగాహన కల్పించడం కోసం ప్రత్యేక సదస్సులు, పాదయాత్రలు, బైక్ ర్యాలీలు నిర్వహిస్తున్నామన్నారు.

కోనసీమలో 20 కొత్త టవర్లు

జనరల్ మేనేజర్ రాజు మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 4జీ సేవలను విస్తృతం చేయడంతో పాటు నెట్‌వర్క్ స్పష్టత కోసం మరో 20 కొత్త టవర్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే జిల్లాలో 80 టవర్లు ఉన్నాయన్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఉన్న 400 టవర్లను మరో 400కి పెంచేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. బీఎస్ఎన్ఎల్‌కు కోనసీమ జిల్లాలో తొలి నుంచీ ఆదరణ ఎక్కువగా ఉందన్నారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 20 వేల హైస్పీడ్ ఫైబర్ నెట్‌వర్క్ ఇంటర్నెట్ కనెక్షన్లు ఉంటే ఒక్క కోనసీమలోనే 9 వేల వరకూ ఉన్నాయన్నారు. వచ్చే ఏడాది మార్చి నాటికి ఉమ్మడి జిల్లాలో ఇంటర్నెట్ కనెక్షన్లను 30 వేలకు తీసుకు వెళ్లాలన్న లక్ష్యంతో శ్రమిస్తున్నామన్నారు. ఉమ్మడి జిల్లాలో 25 లక్షల కనెక్షన్లు చేయాలన్న లక్ష్యం నిర్దేశించుకున్నట్టు స్పష్టం చేశారు. స్థానిక బీఎస్ఎన్ఎల్ కార్యాలయ ఆవరణలో తొలుత బీఎస్ఎన్ఎల్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీఎస్ఎన్ఎల్ డీజీఎంలు వి.రాజశేఖర్‌బాబు, సైదా నాయక్, సీహెచ్ సత్యనారాయణ, ఏజీఎం బి.శ్రీనివాస్, అమలాపురం ఎస్‌డీఓటీ వై.వెంకటేశ్వరావు, జేఈ బి.శ్రీనివాస్ మాట్లాడారు.

అవగాహన ర్యాలీ

బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలపై వినియోగదారులకు అవగాహన కల్పించేందుకు జనరల్ మేనేజర్ రాజు, అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, విశ్రాంత ఉద్యోగులు పట్టణంలో ఆరు కిలోమీటర్ల మేర అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక బీఎస్ఎన్ఎల్ కార్యాలయం నుంచి నల్లవంతెన, ఎన్టీఆర్ మార్గ్, ఎర్ర వంతెన, 216 జాతీయ రహదారి మీదుగా పట్టణంలో మహిపాల వీధి, అశోక్ నగర్, హైస్కూల్ సెంటర్, గడియారం స్తంభం సెంటర్, మమ్మిడివరం గేటు సెంటర్ మీదుగా తిరిగి కార్యాలయానికి చేరుకుంది.

కూటమి ప్రభుత్వంలో జనసేన మహిళల కష్టాలు

- మూడు నెలలుగా అందని తాగునీరు
- పట్టించుకోని సొంత పార్టీ సర్పంచ్
- పంచాయతీకి తాళం వేసి నిరసన


రామరాజులంక పంచాయతీకి తాళం వేస్తున్న జనసేన మహిళలు

మలికిపురం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీలు కలిసి అధికారాన్ని చేజిక్కించుకున్నాయి. టీడీపీ అధినేత చంద్రబాబు ముఖ్యమంత్రిగా, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఉపముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. కానీ క్షేత్రస్థాయిలో జనసేన పార్టీ మద్దతుదారులకు ఇబ్బందులు మాత్రం తప్పడం లేదు. తాగునీటి కోసం కూడా వారు ఆందోళన చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. మలికిపురం మండలం రామరాజులంకలో గురువారం జరిగిన ఈ ఘటన దీనికి నిదర్శనంగా నిలిచింది. ఆ గ్రామస్తులందరూ దాదాపు జనసేన మద్దతుదారులే. సర్పంచ్‌గా ఆ పార్టీకి చెందిన కాకర శ్రీనివాస్ ఎన్నికయ్యారు. కాగా.. గ్రామంలో మూడు నెలలుగా తాగునీరు సక్రమంగా అందడం లేదు. దీంతో మహిళలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. విషయాన్ని గ్రామ సర్పంచ్ కాకర శ్రీనివాస్, కార్యదర్శి బొంతు శ్రీహరికి తెలియజేశారు. రెండు నెలలుగా గడిచినా సమస్య పరిష్కారం కాలేదు. దీంతో విసుగెత్తిపోయిన ఆ మహిళలందరూ గురువారం పంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఈ విషయం తెలిసిన సర్పంచ్ పంచాయతీ కార్యాలయానికి రాలేదు. దీంతో ఆగ్రహం చెందిన మహిళలు పంచాయతీ తాళం వేసి, తమతో తీసుకుపోయారు. తమకు నీరిచ్చిన నాడే తాళం తీస్తామని స్పష్టం చేశారు. ఆ మహిళలందరూ జనసేనకు చెందిన వారే కావడం విశేషం.

కిడ్నాప్ కేసులో పోలీసుల ముమ్మర దర్యాప్తు


కిడ్నాప్‌కు గురైన సంజయ్ కలాసీ




నిందితులు స్వామినాయుడు, మున్నా

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): సినీఫక్కీలో జరిగిన చేపల వ్యాపారి కిడ్నాప్ కేసులో నిందితుల కోసం పోలీసులు ముమ్మరంగా గాలింపు చేపట్టారు. ఈ నేపథ్యంలో జిల్లా పోలీసు కార్యాలయం గురువారం నిందితుల ఫొటోలను విడుదల చేసింది. ఒడిశాకు చెందిన చేపల వ్యాపారి సంజయ్ కలాసీ ఒక కేసులో సెంట్రల్ జైలు నుంచి బెయిల్ మీద విడుదలై బయటకు వస్తున్న సమయంలో కారులో వచ్చిన కొందరు అతడిని కిడ్నాప్ చేసి ఎత్తుకెళ్లిన సంగతి విదితమే. కిడ్నాప్ చేసిన వారిని అమలాపురానికి చెందిన మున్నా, స్వామి నాయుడుగా పోలీసులు గుర్తించారు. ఈ నేపథ్యంలో సంజయ్ కలాసీతో పాటు కిడ్నాపర్ల ఆచూకీ తెలిస్తే ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ 94407 96574, సెంట్రల్ జోన్ డీఎస్పీ 94907 60792 నంబర్లకు సమాచారం ఇవ్వాలని జిల్లా పోలీసు కార్యాలయం కోరింది.

అదుపు తప్పిన ఫ్యాక్టరీ బస్సు

తుని రూరల్: తుని మండలం ఎస్.అన్నవరం శివారు కోమటి చెరువు వద్ద విజయలక్ష్మి క్యాజు (జీడి పిక్కల ఫ్యాక్టరీ) కంపెనీకి చెందిన కార్మికుల బస్సు గురువారం సాయంత్రం అదుపు తప్పి తుప్పల్లోకి దూసుకుపోయింది. పనులు ముగించుకుని ఇళ్లకు వెళ్లేందుకు 35 మంది మహిళా కార్మికులు గెడ్డ బీడు సమీపంలో కంపెనీకి చెందిన బస్సు ఎక్కారు. అనంతరం కిలో మీటరు ప్రయాణించిన తర్వాత బస్సు అదుపు తప్పింది. డ్రైవర్ ప్రకాష్‌కు బీపీ తగ్గడం (డౌన్ అవడం)తో.. ప్రమాదం నుంచి తప్పించేందుకు తుప్పల్లోకి పోనిచ్చినట్టు కార్మికులు తెలిపారు. మహిళా కార్మికులందరూ వి.కొత్తూరు, లోవకొత్తూరు, రాజుపేట తదితర గ్రామాలకు చెందిన వారు. ఈ ఘటనలో కొందరు స్వల్పంగా గాయపడ్డారు.

నకిలీ సిగరెట్ ప్యాకెట్ల స్వాధీనం


కొత్తపేటలో నకిలీ సిగరెట్ బాక్సులు, నిందితులతో అధికారులు

కొత్తపేట: కొత్తపేటలోని శ్రీలహరి ఫ్యాన్సీ అండ్ జనరల్ షాపులో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, రెవెన్యూ, లీగల్ మెట్రాలజీ, కమర్షియల్ ట్యాక్స్, పోలీసు అధికారులు గురువారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 1.71 లక్షల విలువైన ఆరు బ్రాండ్ల నిషేధిత సిగరెట్లను (3420 ప్యాకెట్లు) స్వాధీనం చేసుకున్నారు. గ్రంధి నాగ వెంకట సూర్యనారాయణ మూర్తి అనే వ్యక్తి అమలాపురానికి చెందిన తాళ్లరేవు రాజు నుంచి వీటిని సేకరించి, ఈ షాపు ప్రాంగణంలో రిటైల్‌గా స్థానిక వ్యాపారులకు విక్రయిస్తున్నట్టు గుర్తించారు. ఈ నేపథ్యంలో సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు కోసం కొత్తపేట పోలీసు స్టేషన్‌కు అప్పగించారు. షాపు నందు గల సిగరెట్ ప్యాకెట్లపై చట్టబద్ధమైన వివరాలను ప్రకటించనందుకు లీగల్ మెట్రాలజీ అధికారులు రెండు కేసులు నమోదు చేశారు. రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కేవీఎస్‌వీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ నిషేధిత సిగరెట్లను నిల్వ చేసినా, విక్రయించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీలో విజిలెన్స్ అధికారులు ఎస్ఐటి జగన్నాథరెడ్డి, కానిస్టేబుళ్లు వలీ, వీరబాబు, కిషోర్, తూనికలు కొలతలశాఖ అధికారి కుటుంబరావు పాల్గొన్నారు.